క్లుప్తంగా

మంత్రికి వినతి


వినతిపత్రం అందజేస్తున్న షకీనా

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకుల వృత్తిదారులకు రుణాలివ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముస్లిం, నూర్బాష, దూదేకుల వృత్తి సంక్షేమం సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు, జాతీయ ఇన్‌చార్జ్ షేక్ షకీనా ఆధ్వర్యంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలపై వివరించారు. దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, దూదేకుల ఆత్మగౌరవ భవన నిర్మాణంతో పాటు ఉద్యమకాలం నుండి పనిచేస్తున్న వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నాగూర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.హుస్సేన్, మెడ్చల్ జిల్లా అధ్యక్షుడు అల్లాబాషా, లాల్ సాహెబ్, అబ్దుల్లాహ్, అక్బర్, హాజీపీరా, సైదులు, మదార్, అలీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

రఘునాథపాలెం: మండలంలోని ఆరు గ్రామాల ఆత్మీయ సమ్మేళనం బుధవారం చిమ్మపుడి గ్రామంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ గుత్తా రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయచలక, రేగులచలక, కోటపాడు, చిమ్మపుడి పాపటపల్లి, కేటీ బంజర గ్రామాలకు సంబంధించి సమ్మేళనం నిర్వహించడానికి పార్టీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొంటారని, నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం విధిస్తున్న వివిధ రకాల పన్నులతో వారు జీవనం కొనసాగించే పరిస్థితిలేదని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతీ డ్రైవర్‌కు బ్యాంక్‌ల ద్వారా ప్రభుత్వమే నేరుగా రుణాలు ఇప్పించాలని తెలిపారు. డిగ్రీలు, పీజీలు చదివిన నిరుద్యోగులు ఆటో నడుపుకుని ఉపాధి పొందుతున్నారని వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నేలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ రమ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి కాలంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కేసీఆర్ కిట్ పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏనెకుంటతండాకు చెందిన బానోతు నిర్మలకు ఎంపీపీ మంగీలాల్, జెట్పీటీసీ బెల్లం శ్రీనివాస్ కేసీఆర్ కిట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, డాక్టర్ వసుంధర, సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య ఎంపీటీసి కరుణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న కృష్ణారావు, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వర్తక సంఘం భవనం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కొత్తమాసు హేమసుందర్ రావు, కైలాసపు వేణుగోపాల్‌రావు, నేరెళ్ల శేష గిరిరావు, ఎగుమతి శాఖ అధ్యక్షులు నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	2018
సాయిరాం	మళ్లీ పెళ్లి
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మం గాంధీచౌక్

రాత్రికి రాత్రే నిర్మాణాలు..

నిద్రావస్థలో కేఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం

- ఫిర్యాదులు అందితే నామమాత్రంగా నోటీసులు జారీ
- అనుమతులు లేవని తెలిసినా అడ్డుకోని వైనం



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండానే నగరంలోని 58వ డివిజన్‌లో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో పనులు జరిపిస్తూ, కొద్ది రోజుల్లోనే ఇంటి గోడలు కట్టి స్లాబులు పోశారు. అనుమతులు లేకుండానే ఇంటి నిర్మాణం జరుగుతుందని అధికారులకు ఫిర్యాదులు అందగా సదరు ఇంటి గోడలకు అధికారులు నోటీసులు అంటించారు. అయినా నిర్మాణ పనులు ఆపకుండా పూర్తి చేస్తున్నారు. దీంతో నగరంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

నగరం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. దీంతో వాణిజ్య, వ్యాపారాలతో పాటు నివాసం ఉండేందుకు వలస వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో నగర చుట్టు ప్రక్కల భూముల ధరలు పెద్ద మొత్తంలో పెరిగాయి. భూముల ధరలు పెరగడంతో ఆక్రమణదారులు ఖాళీ స్థలాలపై కన్నేయడం, వారి స్థలాల పక్కన ఉన్న స్థలాల్లోకి వెళ్లి నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. ఇక అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలను చేపడుతూ ప్రభుత్వ ఆదాయంకు గండికొడుతున్నారు. అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా. అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతంటే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రంగా నోటీసులు..

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సదరు నిర్మాణదారుడికి మున్సిపల్ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చి నిర్మాణాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగిస్తే వాటిని తొలగించి, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నగరంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టినా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదని, ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తూతూ మంత్రంగా నోటీసులు గోడలకు అతికించి చేతులు దులుపుకుంటారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక అక్రమ నిర్మాణాలు రాత్రికిరాత్రే పూర్తవుతాయి. గోడలకు అధికారులు అంటించిన నోటీసులు మాత్రం అలానే ఉండిపోతున్నాయి. ఇక టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒకరిద్దరు అధికారుల తీరుతో అక్రమ నిర్మాణాలుస యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

అక్రమ నిర్మాణాల్లో రాజకీయ పలుకుబడి..

నగరంలో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వంతపలుకుతున్నట్లు తెలుస్తోంది. నగరంలోని పలు డివిజన్‌లల్లో అక్రమ నిర్మాణదారులకు రాజకీయ నేతలు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు పెద్ద సంఖ్యలో వినిపిస్తున్నాయి. అధికారులు నోటీసులు ఇస్తే వారు జోక్యం చేసుకొని నిర్మాణాలు కొనసాగేలా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే ప్రజాప్రతినిధులు బాధితులు ఫిర్యాదు చేస్తే వారిపైనే ఎదురుదాడికి దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం..

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను గుర్తిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గుర్తించిన 27 భవనాలకు నోటీసులు జారీ చేశాం. తొలిసారి జారీ చేసిన నోటీసుకు వారం రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే మరో నోటీసు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. 58వ డివిజన్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇంటికి సంబంధించిన వారికి నోటీసులు ఇచ్చాం. వారి నుండి వివరణ కోరాం.

– సాయిరాం, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఖమ్మం

తీరు మార్చుకోకపోతే తిరుగుబాటే..


మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన వ్యక్తులపై దాడులు చేస్తే సహించేది లేదని, తీరు మార్చుకోకపోతే రానున్న కాలంలో తిరుగుబాటు తప్పదని మాజీ ఎంపీ పొంగులేటి అనుచరులు అన్నారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఖమ్మంలో జరిగిన ఎన్టీఆర్ శత జయంతి వేడుకలకు పాల్గొనేందుకు పాల్వంచ నుంచి ఖమ్మం వచ్చిన శీనన్న అభిమాని, దళిత యువకుడు చీకటి కార్తీక్ పై దాడికి పాల్పడ్డారని, ఇది హేయమైన చర్య అన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా భావ ప్రకటన చేసిన నేపథ్యంలో కార్తీక్‌ను నడిరోడ్డుపైనే హత్య చేసే ప్రయత్నం చేశారని, పోలీసులు ఉన్నప్పటికీ వారి సమక్షంలోనే దాడి జరగడం శోచనీయమన్నారు. తనపై హత్య ప్రయత్నం జరిగిందని వాపోతూ చీకటి కార్తీక్ ఫిర్యాదు చేస్తే కనీసం పోలీసులు కేసు నమోదు చేయకపోవడం బీఆర్ఎస్ అరాచకపు పాలనకు అద్దం పడుతుందన్నారు. వెంటనే కేసును సుమోటోగా స్వీకరించి దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వూకంటి గోపాలరావు, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, తిరుమలరావు పాల్గొన్నారు.

యువత ఏకమవ్వాలి

రఘునాథపాలెం: మహిళా, యువత శక్తి ఏకమై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ అన్నారు. హథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రఘునాథపాలెం మండలంలో మంగ్యా తండా, మూలగూడెం, ఎన్వీబంజరలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గ యూత్ డిక్లరేషన్ ఇన్‌చార్జ్ పసుపులేటి దేవేందర్, మండలాధ్యక్షుడు భూక్యా బాలాజీ, సత్యం బాబు, బిహెచ్ రబ్బానీ, మారం కరుణాకర్ రెడ్డి, కొంటేముక్కుల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, దేవత్ శంకర్ నాయక్, బానోత్ వెంకట్రాం, అంగోత్ వెంకన్న, బాల్య, బాలాజీ, బిచ్చు, రమేష్, రమేష్, జేత్య హరియ, ములగుడెం ఉప సర్పంచ్ బొడ రవి, గుగులోత్ బాల, యశ్వంత్, రమేష్, సాగర్, తది తరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో 28 ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు మాట వినడం లేదు..'


విద్యుత్ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

రఘునాథపాలెం: తన ఇంటి సమీపంలోనే వ్యవసాయ విద్యుత్ లైన్ వేలాడుతూ ప్రమాదకరంగా ఉందని అనేక దపాలుగా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని, సమావేశాలకు రాకుండా అధికారులు మాటవినడం లేదని ఎంపీపీ భూక్యా గౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశం కూడా వచ్చిన అధికారులు తమశాఖల నివేదికలను చదివి వినిపించడంతో మొక్కుబడిగా సాగింది. వివిధ శాఖల అధికారులు మూడు నెలల కాలానికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గుత్తా రవి, ఎంపీడీఓ ఆర్.రామకృష్ణ, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో వాసవీ క్లబ్, వనిత భక్తరామదాసు ఆధ్వర్యంలో నిరుపేదలకు సోమవారం నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ గవర్నర్ దోసపాటి వెంకటేశ్వరరావు వివాహ వార్షికోత్సవం సందర్భంగా, క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ రేగూరి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా పేదలకు సాయం చేశారు. కోరట్లగూడెం ఎంపీటీసీ రేగూరి వాసవి, క్లబ్ ప్రతినిధులు తెల్లాకుల వెంకటేశ్వరరావు, పసుమర్తి గురునాథం, కొత్త సోమశేఖర్, కొత్తా రాణి, కొత్త కరుణ, షరాబు పవన్, పసుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎంపీని అరెస్ట్ చేయాలి'

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శిరోమణి, నామాల ఆజాద్‌లు మాట్లాడుతూ.. దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మహిళా రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేయకుండా, చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును అందరూ ఖండించాలన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన రెజ్లర్లను విడుదల చేసి, వారికి కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఝాన్సీ, వెంకటేష్, శారద, విమల, లక్ష్మణ్, కరుణ్, ప్రియాంక, విష్ణు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్


వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న యాత్రికులు, సిబ్బంది

ఖమ్మం మామిళ్లగూడెం: హజ్ యాత్రికులకు నగరంలోని చెరువుబజార్‌లో ఇమ్‌దాదుల్ ఉలూం మదర్సా ప్రాంగణంలో ప్రభుత్వ వైద్యాధికారుల బృందం హజ్‌కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వ్యాక్సినేషన్‌తో పాటు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హజ్‌కమిటీ సభ్యులు షేక్ మగ్బూల్ మాట్లాడుతూ... జూన్ 1న కొత్తగూడెంలో మరోసారి హజ్ యాత్రికులకు వాక్సినేషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు ముఫ్తీ జలాలుద్దిన్, డాక్టర్లు ప్రమీల, జి.సురేందర్, ఇవాంజని, తబస్సుమ్, వ్యాక్సినేషన్ మేనేజర్ రమణ, సూపర్ వైజర్లు శ్రీకాంత్, సత్యనారాయణ, నర్సులు గోపమ్మ, ఉమా, హకీమ్, మునీర్, పర్వేజ్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' దేశానికే ఆదర్శం


తిరుమలాయపాలెం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


కూసుమంచిలో..

కూసుమంచి: కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శమని డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ అన్నారు. సోమవారం జీళ్లచెరువులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు, బీరోలు గ్రామాల్లో సోమవారం కంటివైద్య శిబిరాలను ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కంటి సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వసుంధర, రామారావు సర్పంచ్‌లు నామా ప్రసాద్, వంచర్ల అలివేలమ్మ, ఎంపీటీసీలు పులుగుజ్జు వెంకటేశ్వర్లు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతు బాంధవుడు


పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్

కామేపల్లి(కారేపల్లి): సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని, రైతు సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియా నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి రైతువేదిక భవంలో సొసైటీలతో రైతులకు పంపిణీ చేసే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హరిప్రియానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు రైతులు విత్తనాల కోసం క్యూలు కట్టి బారులు తీరేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రైతు బంధు, రైతుబీమా పథకాలతో రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచి దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తారాదేవి, సొసైటీ చైర్మన్ తీర్థాల చిదంబరం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంరూరల్: పేదలకు అండగా ఎర్రజెండా ఎల్లప్పుడూ ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం మండలంలోని తల్లంపాడులో జరిగిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... సుందరయ్య జీవితం మహోన్నతమైందని, నేటి యువత ఆయన బాటలో నడవాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు కారుచౌకగా అమ్ముతూ ప్రజలపై పెనుభారం మోపుతున్న మోదీని గద్దె దించేందుకు లౌకికశక్తులన్నీ ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి. రమేష్, నంద్ర ప్రసాద్, మల్లయ్య, బి. వెంకటేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే పోరాటాలు


మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: పాలకులు ఎవరైనా ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తే ప్రజా పోరాటాలు తప్పవని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ... ప్రజలకు రకరకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పార్లమెంటు భవన ప్రారంభోత్సవ సందర్భంగా నిమ్న వర్గాల పట్ల మోదీ వైఖరి బహిర్గతమైందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 4న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


చెక్కు అందజేస్తున్న పులిపాటి ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: కులమతాలకతీతంగా డాక్టర్ పులిపాటి సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని, సేవాతత్పరుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ అని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కమర్తపు మురళి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలో పులిపాటి ప్రసాద్-పద్మప్రియ దంపతుల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోళ్ల రాధాకృష్ణ సభాధ్యతన జరిగిన కార్యక్రమంలో పులిపాటి ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.10 లక్షలను అక్షోభయ ట్రస్ట్‌కు అందజేశారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యానిధికి రూ.55,116, సామాజిక సేవా కార్యక్రమాలకు రూ.25 వేల చెక్కును ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బుడిగం శ్రీనివాస్, బుర్రి వెంకట్, ఆర్యవైశ్య సంఘం వనమా సూరి, కిరాణాజాగీర్ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, వైద్యులు కావ్య, నీరజ, బీసీ జేఏసీ చైర్మన్ పాల్వంచ రామారావు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రపతికి ఆహ్వానం లేకపోవడం దారుణం'

నేలకొండపల్లి: నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం దారుణమని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోనాయిగూడెం, ఆచార్లగూడెం, ఆరెగూడెం గ్రామాల్లో సోమవారం దళితుల స్థితిగతులపై క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ప్రారంభానికి అత్యున్నత పదవిలో ఉన్న వారిని పిలవకుండా అవమానించటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా ప్రతీ దళిత కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, బొడ్డు ఆంజనేయులు, ఉపేందర్, బొడ్డు వేణు, కిషోర్, పి.భాస్కర్, నవీన్, అక్రమ్, సురేష్, ప్రకాష్, పెద్దపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలి

కామేపల్లి(కారేపల్లి): ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాదావత్ శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కామేపల్లిలో పొద్దుటూరి అనంతరాములు అధ్యక్షతన సంఘం మండల కమిటీ సమావేశమయ్యింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కూలీలు ఎండదెబ్బలకు గురి అవుతున్నారని, కనీస సౌకర్యాలు లేక పోవటంతో కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. కొలతలతో సంబంధం లేకుండా, రోజువారి కూలీ రూ.600లు చెల్లించాలని, పని దినాలను 200ల రోజులకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోతు మంగీలాల్, లావుడ్యా బాష్‌సింగ్, నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ అవతరణ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కూసుమంచి: తెలంగాణా ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం కూసుమంచిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మల్లయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంకోటి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, భాస్కర్, నాయకులు నర్సింహారావు, వీరస్వామి, స్వరూప, యాకయ్య, భద్రూ, ఉపేందర్, నాగేందర్, మదనాచారి, సీఆర్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు, ఆలయ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు సోమవారం సాంప్రదాయ పద్ధతుల్లో పండితుల, అర్చకుల శాస్త్రోక్తంగా ప్రారంభించారు. దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి వనం వెంకటనర్సింహారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఎస్ బి.కృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.